సాక్షి ప్రకాశం

గురువారం । 10 । అక్టోబర్ । 2024



ఎందుకీ శిక్షణ?

ఎన్నికైన నాలుగేళ్ల తరువాత వార్డు మెంబర్లు, పంచాయతీ ఉప సర్పంచ్‌లకు మొక్కుబడిగా శిక్షణ ఇస్తున్నారు. ప్రచార యావ, నిధుల దుర్వినియోగమేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. - IIలో..



పెరిగిన ధరలకనుగుణంగా పింఛన్ ఇవ్వాలి

ఈపీఎస్ 95 పింఛన్‌దారులకు పెరిగిన ధరలకు అనుగుణంగా పింఛన్ ఇవ్వాలని ధర్నా చేశారు. - IIలో..

గరిష్ఠం/కనిష్ఠం
38/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ట్రైన్ ట్రయల్ రన్



పొదిలి స్టేషన్ వద్ద ట్రైన్

పొదిలి: నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈక్రమంలో బుధవారం ట్రైన్ ట్రయల్ రన్ నిర్వహించారు. రాజుపాలెం సమీపంలో నిర్మాణంలో ఉన్న పొదిలి రైల్వే స్టేషన్ వరకు ట్రయల్ రన్ జరిగింది. దీనిని చూసేందుకు స్థానికులు రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నారు.

రైతులంతా ఈ-పంట నమోదు చేసుకోవాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: రైతులంతా తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా రైతులకు సూచించారు. బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్నమిట్టలో పర్యటించి మిరప పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఈ-పంట నమోదు ద్వారా రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు దక్కుతున్నాయన్నారు. తమకు నీటి సమస్య ఉందని, కాలువల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కలెక్టర్‌ను కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. అనంతరం నియోజకవర్గ వ్యవసాయ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఎరువులు, విత్తనాల నాణ్యతను, తేమ శాతాన్ని పరీక్షించే విధానాన్ని సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. ఈ-పంట నమోదైన తీరు గురించి అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులంతా ఈ-పంట నమోదు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. కలెక్టర్ వెంట వ్యవసాయ శాఖ ఏడీ రమేష్‌బాబు, తహశీల్దార్ ఆదిలక్ష్మి, ఏఓ పావని, ఉద్యాన అధికారి ప్రత్యూష, అధికారులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



ఐసీడీఎస్ జిల్లా కార్యాలయం

ఒంగోలు వన్‌టౌన్: మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ విభాగంలో వివిధ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిణి కే మాధురి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు ఐసీడీఎస్, ప్రత్యేక దత్తత విభాగం, బాల సదనం, గిద్దలూరు, ఒంగోలు వన్ స్టాప్ సెంటర్ (సఖీ సెంటర్) విభాగాల్లో పోస్టులు ఉన్నట్లు తెలిపారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌లో సోషల్ వర్కర్ (స్త్రీ)-1, డేటా ఎనలిస్టు-1, స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ విభాగంలో సోషల్ వర్కర్ కమ్ ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేటర్ (స్త్రీ)-1, డాక్టర్ (పార్ట్‌టైమ్)-1, ఆయా (స్త్రీ)-1, చౌకీదార్-1, ఒంగోలు, గిద్దలూరు ప్రాంతాల్లో ఉన్న చిల్డ్రన్ హోమ్‌లలో ఒంగోలులో హౌస్‌కీపర్ (స్త్రీ)-1, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికపై ఎడ్యుకేటర్స్-2, పార్ట్‌టైం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్-2, పార్ట్‌టైం మ్యూజిక్ టీచర్-1, పార్ట్‌టైం పీటీ ఇన్‌స్ట్రక్టర్-1, పార్ట్‌టైం యోగా టీచర్-1, గిద్దలూరులో స్టోర్ కీపర్ కం అకౌంటెంట్-1, కాంట్రాక్టు పద్ధతిపై ఎడ్యుకేటర్-2, పార్ట్‌టైమ్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్-1, పార్ట్‌టైం మ్యూజిక్ టీచర్-1, పార్ట్‌టైం పీటీ ఇన్‌స్ట్రక్టర్-1, పార్ట్‌టైం యోగా ఇన్‌స్ట్రక్టర్-1, పార్ట్‌టైం వన్‌స్టాప్ సెంటర్ (సఖీ సెంటర్) ఒంగోలులో మానసిక సోషల్ వర్కర్-1 (స్త్రీ), కేస్ వర్కర్-1 (స్త్రీ), పారా మెడికల్ పర్సన్-1 (స్త్రీ), కంప్యూటర్ చేయడం తెలిసిన ఆఫీస్ అసిస్టెంట్-1, నైట్ సెక్యూరిటీ గార్డ్-1, మల్టీ పర్పస్ హెల్పర్‌లు-3 పోస్టులు ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 14 నుంచి 21వ తేదీలోపు స్వీకరిస్తారన్నారు. దరఖాస్తులను జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి, సాధికారత అధికారిణి ఒంగోలు, రామనగర్ 3వ లైన్‌లోని కార్యాలయంలో అందించాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు prakasam.ap.gov.in/noticecategory/recruitment అనే వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపారు.

లీడర్లకే లిక్కర్ కిక్



టీడీపీ లీడర్లు లిక్కర్ మాఫియాగా అవతరించారు. మద్యం దుకాణాలన్నీ తమ గుప్పెట్లోనే పెట్టుకునేందుకు బేరాలకు, బెదిరింపులకు దిగుతున్నారు. పైసా పెట్టుబడి పెట్టకుండానే వాటా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేయడంతో మద్యం వ్యాపారులు దరఖాస్తులు చేసేందుకు విముఖత చూపిస్తున్నారు. పారదర్శకత అంటూ పైకి చెబుతున్నా.. పచ్చనేతలకే ప్రయోజనాన్ని కల్పించే విధంగా ప్రభుత్వ పెద్దలు, పార్టీ ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 5,130 దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ అధికారులు అంచనా వేసినా.. బుధవారం నాటికి 2,077 మాత్రమే వచ్చాయి. టీడీపీ నేతలు వ్యవహరిస్తున్న తీరుతో పాటు మరో వైపు భారీగా పెరిగిన దరఖాస్తు ఫీజు కారణంగా వ్యాపారులు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. స్వేచ్ఛాయుత వాతావరణం ఉండి ఉంటే మద్యం దుకాణాలకు తీవ్రమైన పోటీ నెలకునేదని, రాష్ట్రంలో వ్యాపారాలు చేసుకునే వాతావరణం లేకపోవడం వల్లనే వ్యాపారులు ముందుకు రావడం లేదన్న మాట వినిపిస్తుంది.

- మద్యం దుకాణాలన్నీ తమ్ముళ్ల గుప్పెట్లోనే..
- వాటాల డిమాండ్‌తో వెనుకాడుతున్న వ్యాపారులు
- లక్ష్యానికి 50 శాతం కూడా రాని దరఖాస్తులు
- 5,130 దరఖాస్తుల అంచనా.. ఇప్పటి వరకు 2,077 మాత్రమే దాఖలు
- టీడీపీ ప్రజా ప్రతినిధుల కనుసన్నల్లోనే వ్యవహారం
- పశ్చిమాన బెదిరింపుల పర్వం

ఒంగోలు టౌన్: జిల్లాలో ఎక్కడ నలుగురు గుమికూడినా మద్యం దుకాణాలపై చర్చ జరుగుతోంది. దుకాణాల కేటాయింపు ప్రక్రియ అంతా ఫార్స్ అంటున్నారు. దుకాణానికి రెండు.. మూడు దరఖాస్తులు వేసుకుని ఇప్పటికే హస్తగతం చేసుకున్నారని చెప్పుకుంటున్నారు. దుకాణాలను దక్కించుకునేందుకు టీడీపీ నేతలు బెదిరింపుల పర్వానికి తెరతీశారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో ఇసుక, మట్టి, గ్రావెల్ మాఫియాలుగా తయారైన లీడర్లు తాజాగా మద్యం దుకాణాలతో దోచుకునేందుకు సిద్ధమయ్యారు. తాము మాత్రమే మద్యం విక్రయించాలని అధికార పార్టీ నాయకులు హుకుం జారీ చేయడంతో చాలా మంది మద్యం వ్యాపారులు దూరంగా ఉండిపోయారు. మిత్రపక్షమైన జనసేన, బీజేపీ నాయకులను సైతం మద్యం దుకాణాల దరిదాపులకు రాకుండా ఉండేలా వార్నింగ్‌లు ఇవ్వడంతో వారు కూడా మాకెందుకు వచ్చిన గొడవంటూ మిన్నకుండిపోయారు. టీడీపీ నేతలు సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యం మేర దరఖాస్తులు రాలేదు.

ఇప్పటి వరకు 2,077 దరఖాస్తులే

జిల్లాలో 171 మద్యం దుకాణాలకు 5,130 దరఖాస్తులు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఒక్కో దుకాణానికి సగటున 30 దరఖాస్తుల వరకు లక్ష్యంగా పెట్టుకుంది. బుధవారం చివరి రోజని చెప్పడంతో జిల్లా వ్యాప్తంగా ఒకేసారి దరఖాస్తులను చేసుకున్నారు. ఒంగోలు నగరం, రూరల్ కలిపి 34 దుకాణాలకు 389 దరఖాస్తులు వచ్చాయి. చీమకుర్తిలో 16 దుకాణాలకు 234, సింగరాయకొండలో 14 దుకాణాలకు 265, పొదిలిలో 16 దుకాణాలకు 120, దర్శిలోని 23 దుకాణాలకు 205 దరఖాస్తులు వచ్చాయి. మార్కాపురం టౌన్, రూరల్ 13 దుకాణాలు ఉండగా 193, కనిగిరిలో 19 దుకాణాలకు 242, గిద్దలూరులో 13 దుకాణాలకు 143, కంభంలో 10 దుకాణాలకు 153, ఎర్రగొండపాలెంలోని 13 దుకాణాలకు 133 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో మొత్తంగా 2,077 దరఖాస్తులు వచ్చాయి. ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ప్రభుత్వం గడువును మరో మూడు రోజులు పెంచింది. ఈ నెల 11వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించింది. 12, 13 తేదీల్లో పరిశీలన, 14వ తేదీన జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా తీస్తారు. లైసెన్సులు పొందిన వారికి దుకాణాలను కేటాయిస్తారు.

వ్యాపారం సంగతేంటి

ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల ఫీజును నిర్ణయించారు. ఇది నాన్ రీఫండబుల్ మొత్తం. కేవలం దరఖాస్తుల రూపంలోనే జిల్లా నుంచి రూ.105 కోట్ల ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆశించింది. అయితే ఇప్పటి వరకు 2,077 దరఖాస్తులు రావడంతో రూ.41.54 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రభుత్వ లక్ష్యం ప్రకారం మరో రూ. 60 కోట్ల పైగా రావాల్సి ఉంది. అందుకే ఈ లక్ష్యాన్ని సాధించే క్రమంలోనే గడువును మరో మూడు రోజుల పాటు పెంచిందని అధికారులు చెబుతున్నారు. లాటరీ తర్వాత దుకాణాలను కేటాయించడం జరుగుతోంది. ఆ తర్వాత అసలు కథ మొదలవుతుంది. మద్యం దుకాణాలను నాలుగు శ్లాబులుగా విభజించడం తెలిసిందే. జిల్లాలో 120 దుకాణాలు రూ.65 లక్షల శ్లాబు పరిధిలోకి వస్తుండగా, మరో 71 దుకాణాలు రూ.55 లక్షల శ్లాబు పరిధిలోకి వస్తున్నాయి. వ్యాపారం ఉన్నా లేకున్నా ఏడాదికి ఒక్కో దుకాణానికి రూ.65 లక్షలు, రూ.55 లక్షల లెక్కన కిస్తీ చెల్లించాల్సి ఉంటుంది.

తాగించు.. ఊగించు..

దరఖాస్తుల రూపంలో రూ.105 కోట్లు, కిస్తీ రూపంలో మరో రూ.117 కోట్ల మొత్తం రూ. 222 కోట్లను వ్యాపారుల నుంచి వసూలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దుకాణాలు మొదలైన తర్వాత వ్యాపారులకు ఎలాంటి టార్గెట్లను పెడుతుందో ఊహించుకుంటేనే పేదల కుటుంబాల్లో వణుకు పుడుతోంది. జిల్లాలోని 171 దుకాణాల ద్వారా ప్రభుత్వానికే చేరితే.. ఇక మద్యం దుకాణాలు దక్కించుకున్న నేతలు రెండింతలు సంపాదించుకునేందుకు ప్లాన్ వేశారు. ఇందు కోసం ఊరూరా.. వీధి వీధినా బెల్టుషాపులు ఏర్పాటు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రతి షాపునకు అనుబంధంగా పర్మిట్ రూములు కూడా అందుబాటులోకి వచ్చేస్తాయి.

ఎవరికి వచ్చినా మాకు వాటా ఇవ్వాల్సిందే

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో లిక్కర్ డాన్‌లు బెదిరింపులకు పాల్పడుతున్నారు. లిక్కర్ షాపులకు టెండరు వేసిన వారికి ఫోన్లు చేసి షాపు ఎవరికి వచ్చినా మాకు వాటా ఇవ్వాల్సిందేనంటూ బెదిరింపులకు దిగుతున్నారు. మార్కాపురం ఎక్సైజ్ పరిధిలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం 68 మద్యం షాపులకు టెండర్లు పిలిచారు. ఈనెల 11వ తేదీ సాయంత్రంతో టెండర్ల గడువు ముగియనుంది. మొత్తం 1068 దరఖాస్తులు దాఖలయ్యాయి. ముఖ్యంగా అత్యధికంగా డిమాండ్ ఉన్న మార్కాపురం, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, కంభం, బేస్తవారిపేట, గిద్దలూరు, పొదిలి, కనిగిరి, కొనకనమిట్ల, తర్లుపాడు, పెద్దదోర్నాల, పామూరు తదితర పట్టణాల్లోని షాపులపై కూటమి కోటరీలో భాగస్వాములైన టీడీపీ, జనసేన నేతలు టెండర్లు వేసిన వారికి ఫోన్లుచేసి బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. మీకు షాపు వచ్చినా అందులో మాకు కచ్చితంగా వాటా ఇవ్వాల్సిందే, లేకుంటే ఎలా బిజినెస్ చేస్తారో.. చూస్తామంటూ హెచ్చరిస్తున్నారు.

రౌడీషీటర్లకు ఎస్పీ స్పెషల్ ట్రీట్‌మెంట్

ఒంగోలు టౌన్:

నగరంలో దౌర్జన్యాలకు పాల్పడుతున్న రౌడీలకు ఎస్పీ ఏఆర్ దామోదర్ స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇచ్చారు. సోమవారం తెల్లవారుజామున నగరంలోని పాత కూరగాయల మార్కెట్ వద్ద సాయికృష్ణ అనే ఆటోడ్రైవర్‌పై దౌర్జన్యం చేశారు. స్నేహితులతో కలిసి పుట్టినరోజు చేసుకున్న రౌడీ షీటర్ హరీష్.. నడిరోడ్డుపై మద్యం సేవించి చిందులు తొక్కడం, ఆటో డ్రైవర్‌పై దాడికి పాల్పడటాన్ని ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు.

తరచూ ఇలాంటి ఘటనలు..

నగరంలో ఇటీవల తరుచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అర్ధరాత్రిపై పుట్టినరోజు వేడుకల పేరుతో కేకులు కోసి రచ్చ చేస్తున్నారు. మరికొంత మంది మోడీఫైడ్ సైలెన్సర్లతో పెద్ద పెద్ద శబ్దాలు చేస్తున్నారు. ఇది నగర ప్రజలకు తలనొప్పిగా తయారైంది. రాత్రిళ్లు పోలీసుల గస్తీ తగినంత లేకపోవడంతో కొందరు రౌడీషీటర్లు పేట్రేగిపోతున్నారు. నెల రోజుల క్రితం గోరంట్ల సినిమా హాలు సెంటర్‌లో ఒక వ్యక్తి ఏకంగా పోలీసుపైనే చేయి చేసుకున్నాడు. పోలీసు అయితే నాకేంటిరా. ఇక్కడ నాకు అడ్డు చెప్పేవాడే లేడంటూ పిడిగుద్దులు కురిపించాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘటనను ఎస్పీ ఏఆర్ దామోదర్ సీరియస్‌గా తీసుకున్నారు. ఆటోడ్రైవర్‌పై దాడికి పాల్పడిన రౌడీషీటర్ హరిష్ జాన్సన్, అగస్టీన్‌లతో పాటుగా గత నెల 4వ తేదీన మున్సిపల్ కార్యాలయం వద్ద ధనిశెట్టి జానకీరాంపై దాడి చేసిన పూజారి దేవ, అవుల చిన్నోడు ఉరఫ్ డేవిడ్ బిల్లా, శివలను ఎస్పీ కార్యాలయానికి పిలిపించి తనదైన శైలిలో ట్రీట్‌మెంట్ ఇచ్చారు. స్వయంగా లాఠీ చేతపట్టి స్పెషల్ కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. అనంతరం వారిపై హత్యాయత్నం, ఇతర సెక్షన్ల కింద అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఎవరైనా సరే రౌడీయిజం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. రౌడీయిజం పేరుతో చిన్న ఘటనకు పాల్పడినా రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. సోమవారం పాత మార్కెట్ వద్ద జరిగిన ఘటనపై, గతంలో ఒక గిరిజన యువకుడిపై మూత్రం పోసిన కేసులోని నిందితులు, బెయిల్‌పై బయటకు వచ్చిన ఇతరా నిందితులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బెయిల్‌పై బయట తిరుగుతున్న మరికొందరిపై రౌడీషీట్‌తో పాటుగా పీడీ యాక్టు ప్రతిపాదనలు పంపించాలని వన్‌టౌన్ సీఐ నాగరాజుకు ఆదేశించారు.

చీమకుర్తి ఫోన్‌కాల్‌పై బైండోవర్...

కాగా గత రెండు రోజులుగా రాష్ట్రంలో సంచలనం సృష్టించిన చీమకుర్తి గ్రానైట్ ఆడియోకి సంబంధించి విచారణ చేసిన అనంతరం ఒంగోలుకు చెందిన కాండ్ర శ్రీకాంత్‌పై 126 బీఎన్ఎస్ఎస్ ప్రకారం బైండోవర్ చేసినట్లు తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- కలెక్టరు తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: జిల్లాలో ఇసుక, మద్యం విషయంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ హెచ్చరించారు. ఒంగోలు కలెక్టరేట్‌లో ఇసుక, మద్యం పాలసీపై బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జూలై 8 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకొచ్చిందన్నారు. జిల్లాలో జూలై 8వ తేదీ నుంచి 62,291 టన్నుల ఇసుకను ఉచిత ఇసుక పాలసీ కింద పంపిణీ చేశారన్నారు. జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్స్ లేనందున, అవసరమైన ఇసుకను నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాల్లోని స్టాక్ పాయింట్స్ నుంచి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక అవసరాల కోసం మొత్తం 285 వాగులు, వంకలను గుర్తించారన్నారు. చట్టబద్ధమైన అనుమతులు పొంది పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు సంబంధిత వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా స్థాయి శాండ్ కమిటీకి దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇస్తారని చెప్పారు. రానున్న రోజుల్లో అనుమతి ఇచ్చిన పట్టా భూముల ఇసుకరీచ్‌ల నుంచి ఇసుక రవాణా చేసుకోవచ్చన్నారు. నెల్లూరు జిల్లాలోని కరేడు, దప్పలంపాడు రెండు డిసిల్టేషన్ పాయింట్స్ నుంచి 2,26,108 టన్నుల ఇసుక అక్టోబరు 15 నుంచి అందుబాటులోకి రానుందని తెలిపారు. అక్టోబరు 15 నుంచి 10 ఇసుక రీచ్‌లు ప్రారంభం కానున్న నేపథ్యంలో కడప జిల్లా నుంచి 6,93,750 టన్నుల ఇసుక అందుబాటులోకి రానుందన్నారు. సెప్టెంబరు 20వ తేదీ నుంచి ఇసుక కావాల్సిన ప్రజలు https://sand.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటున్నారన్నారు. ఇప్పటి వరకు 10,287 టన్నుల ఇసుక కోసం 519 ఆర్డర్స్ బుక్ అయినట్లు తెలిపారు. ఇసుక కార్యకలాపాలకు సంబంధించి ఫిర్యాదులు చేసేందుకు వినియోగదారుల కోసం 6281799518 ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబరును ఏర్పాటు చేశారన్నారు.

■ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలో 171 మద్యం దుకాణాలకు ఈ నెల 1 నుంచి ఆన్‌లైన్, ఆఫ్ లైన్ రూపంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 16 నుంచి 2026 సెప్టెంబరు 30 వరకు రెండేళ్ల కాల పరిమితితో లైసెన్స్ ఇస్తారన్నారు. జిల్లాలో 171 దుకాణాల్లో గీతకార్మికుల కోసం 17 దుకాణాలను కేటాయించాల్సి ఉందన్నారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపారు. ఈ నెల 14వ తేదీ డ్రా తీస్తారని, డ్రా లో గెలుపొందిన వారు ఈ నెల 16వ తేదీ నుంచి దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారం కొనసాగించవచ్చని తెలిపారు.

■ ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 70 కేసులు బుక్ చేశామన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే సంబంధిత వాహనాలను సీజ్ చేయడం, అరెస్ట్ చేయడం, మళ్లీ, మళ్లీ పట్టుబడితే వారిపై పీడీ యాక్ట్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టరు తమీమ్ అన్సారియా



వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక పై సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లా అధికారులతో సమావేశమై వంద రోజుల ప్రణాళికల లక్ష్యాల పురోగతిపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకం కింద వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో చూపిన పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డ్వామా పీడీని ఆదేశించారు. గృహ నిర్మాణాల పురోగతిపై ఆశాఖ అధికారులు దృష్టి సారించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబిరాణి, డీఆర్డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ మాధురి, ఏపీఎంఐపీ పీడీ రమణ, డీపీఓ వెంకటనాయుడు, డీటీసీ సుశీల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్, ఆర్ అండ్ బీ ఎస్ఈ దేవానందం తదితరులు పాల్గొన్నారు.



గిద్దలూరులో పచ్చని మొక్కల మధ్య సరస్వతీ దేవి అలంకరణలో వాసవీమాత

వాగ్దేవీ వందనం

గిద్దలూరు రూరల్: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. అద్దాల మండపంలోని ఊయలలో ఉన్న అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టూ సుమారు 400 మొక్కలు ఉంచి వనాన్ని తలపించేలా అలంకరించారు.

జీజీహెచ్ నుంచి ప్రైవేటు అంబులెన్స్‌ల తొలగింపు



జీజీహెచ్ ఆవరణలో నిన్న అలా...



నేడు ఇలా...

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్ ఆవరణలో ఉన్న ప్రైవేటు అంబులెన్స్‌లను అక్కడి నుంచి తీసివేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సావిత్రి ఆదేశించారు. దీంతో ప్రైవేటు అంబులెన్సులను అక్కడి నుంచి తొలగించారు. ఈనెల 7వ తేదీ 'సాక్షి'లో అంబులెన్స్ మాఫియాపై 'శవాల్ని పీక్కే జలగలు' శీర్షికన వార్త ప్రచురితమైంది. జీజీహెచ్ ప్రాంగణంలోనే ప్రైవేటు అంబులెన్సులు ఏర్పాటు చేసుకొని వాటి నిర్వాహకులు రోగి బంధువులు, మృతుల బంధువుల నుంచి అందినంత దండుకుంటున్నారు. ఈ విషయంపై 'సాక్షి'లో కథనం రావడంతో బుధవారం జీజీహెచ్ సూపరింటెండెంట్‌తోపాటు ఇతర వైద్యాధికారులు స్పందించి ప్రాంగణంలోని అంబులెన్స్ తొలగించాలని ఆదేశించారు. ఆపదలో సాయంచేసి మానవత్వం చాటుకోవాలని, అధిక ధరలు వసూలు చేయవద్దని హెచ్చరించారు.

పది రోజులైనా చర్యలేవీ..

- మైథిలిని తీసుకెళ్లిన యువకుడిపై కేసెందుకు పెట్టలేదు
- న్యాయం చేయకపోతే కలెక్టరేట్ దగ్గర ధర్నా చేస్తాం
- డీఈవో సుభద్రతో క్రీడాకారిణి మైథిలి తల్లిదండ్రులు



చెరుకూరులో మైథిలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డీఈవో సుభద్ర

పొన్నలూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారిణి సన్నెబోయిన మైథిలి కుటుంబాన్ని ఆమె స్వగ్రామం మండలంలోని చెరుకూరులో జిల్లా విద్యాశాఖ అధికారి సుభద్ర బుధవారం పరామర్శించారు. మైథిలి మృతిచెంది పది రోజులైనా ఇంత వరకు ఎవరూ మమ్మల్ని పట్టించుకోలేదని ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మైథిలిని తీసుకెళ్లిన యువకుడిపై ఇప్పటి వరకు ఎందుకు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తమ కుమార్తె మృతి చెంది పది రోజులైనా సరే పోలీసులు కేసు నమోదు చేయకపోవడం ఏమిటని నిలదీశారు. ఉన్నతాధికారులెవరూ కూడా వచ్చి పరామర్శించలేదన్నారు. తమకు న్యాయం జరగకపోతే కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నా చేస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మైథిలి కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేస్తామన్నారు. దీనిపై కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. మైథిలి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. విద్యాశాఖ నుంచి మైథిలి కుటుంబానికి తోడ్పాటు అందిస్తామన్నారు. ప్రస్తుతం విచారణ జరుగుతుందని, విచారణలో అన్ని విషయాలు బయటకు వస్తాయని నివేదికను బట్టి ఉన్నతాధికారులు సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. డీఈవో వెంట డిప్యూటీ డీఈవో సుబ్బారావు, ఎంఈఓలు ఉన్నారు.

క్లుప్తంగా

స్పా సెంటర్‌పై పోలీసుల దాడి

ఒంగోలు టౌన్: నగరంలోని బండ్లమిట్ట పార్వతమ్మ గుడి వద్ద ఉన్న వీటు స్పా మసాజ్ సెంటర్‌పై బుధవారం రాత్రి 10:30 గంటల సమయంలో వన్‌టౌన్ పోలీసులు దాడి చేశారు. పక్కా సమాచారంతో దాడి చేసిన పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా మసాజ్ చేస్తున్న యువతిని, పురుషుడిని, సెంటర్ నిర్వాహకుడిని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ వై నాగరాజు సిబ్బందితో వెళ్లి తనిఖీ చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా నిబంధనలకు వ్యతిరేకంగా అసాంఘిక కార్యకలపాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మసాజ్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహించామని, అక్కడేమీ జరగలేదని సీఐ తెలిపారు.

రెండు కంటైనర్లు సీజ్



విజిలెన్స్ అధికారులు పట్టుకున్న కంటైనర్

ఒంగోలు సిటీ: అక్రమంగా గ్రానైట్ శ్లాబ్స్ తరలిస్తున్న రెండు కంటైనర్లను ఒంగోలులో మంగళవారం రాత్రి మైనింగ్ విజిలెన్స్ అధికారులు పట్టుకుని సీజ్ చేసినట్లు మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సీజ్ చేసిన కంటైనర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. గ్రానైట్ శ్లాబ్ అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ రామచంద్ర, సిబ్బంది సురేష్, శంకర్, హరిబాబు, తిరుపతిరావు పాల్గొన్నారు.

గుండెపోటుతో తహసీల్దార్ మృతి



తహసీల్దార్ దాసు(ఫైల్)

అర్ధవీడు: అర్ధవీడు తహసీల్దార్ కుక్కముడి దాసు(56) గుండెపోటుతో మృతి చెందారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం వచ్చమల్లపాడు స్వగృహంలో ఉన్న సమయంలో ఆయన ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే కుటుంబసభ్యులు కారులో గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. దాసు గతంలో పుల్లలచెరువు, యర్రగొండపాలెం తహసీల్దార్‌గా పనిచేశారు. మృతునికి భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు.

జేసీబీని ఢీకొట్టిన ఆటో

- ఇద్దరికి గాయాలు



సంఘటనా స్థలంలో ఉన్న ఆటో, జేసీబీ

కంభం: ఆగి ఉన్న జేసీబీ వాహనాన్ని ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన అనంతరపురం- అమరావతి హైవే రోడ్డుపై బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని జంగంగుంట్ల గ్రామానికి చెందిన తమ్మిశెట్టి సత్యనారాయణ అనే వ్యక్తి సరుకల ఆటోతో జంగంగుంట్ల వెళ్తూ స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం సమీపంలో రోడ్డుపక్కన ఆగి ఉన్న జేసీబీ వాహనాన్ని ఢీకొట్టడంతో ఆటో ముందు భాగం నుజ్జు నుజ్జయింది. ఈ ఘటనలో సత్యనారాయణకు స్వల్ప గాయాలు కాగా ఆటోలో కూర్చొని ఉన్న అతని భార్యకు తీవ్ర గాయాలయ్యాయి.

క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రుల వద్ద వివరాలు సేకరించారు.

ఎందుకీ శిక్షణ?

- ఎన్నికలై నాలుగేళ్లయ్యాక ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ
- మొక్కుబడి శిక్షణపై పెదవి విరిచిన గ్రామ ప్రజాప్రతినిధులు
- అయినా వార్డు సభ్యుల మాట వినేదెవరో అధికారులే సెలవివ్వాలని రుసరుస
- రెండు రోజుల శిక్షణకు అన్ని మండలాల్లో అతి స్వల్పంగా హాజరు
- గతంలో వైఎస్సార్ సీపీ రంగులంటూ రచ్చ చేసి.. నేడు ఫ్లెక్సీలనూ వదలని టీడీపీ నేతలు
- ప్రచార యావ, నిధుల దుర్వినియోగమే నంటున్న విశ్లేషకులు



కొమరోలు : శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు



సింగరాయకొండ ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వం ఇచ్చిన నమూనా ప్రకారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సింగరాయకొండ/కొమరోలు: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులతోపాటు ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని నొక్కివక్కాణిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఆ మేరకు నిధులు మంజూరు చేయకుండా చేతులు దులుపుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘ నిధులు పంపిణీ చేయకుండా ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ మోకాలడ్డుతున్నారు. గ్రామాల్లో టీడీపీ సానుభూతిపరులైన సర్పంచ్‌లు అతి తక్కువ మంది ఉండటం, వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన వారే సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లుగా కొనసాగుతుండటం కూటమి పెద్దలకు, టీడీపీ ముఖ్య నేతలకు కంటగింపుగా మారింది. ఈ నేపథ్యంలోనే గతంలో చేపట్టిన పనులకు బిల్లులు చేయకుండా, కొత్త పనులు చేపట్టనీయకుండా అధికారుల ద్వారా ఎమ్మెల్యేలు కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. తమ మాట వినని గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను ఉద్దేశపూర్వకంగా వేధిస్తూ రాక్షసానందం పొందుతున్నారు. ఈ పరిస్థితుల్లో పల్లెల అభివృద్ధి పేరుతో ఉప సర్పంచ్‌లు, ఇద్దరు చొప్పున వార్డు సభ్యులకు శిక్షణ అంటూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమం జిల్లాలో మొక్కుబడిగా సాగింది.

వాస్తవానికి పంచాయతీ ఎన్నికలు జరిగి సుమారు నాలుగేళ్లు అవుతోంది. ఈ తరుణంలో వార్డు మెంబర్లకు విధి విధానాలు, బాధ్యతలు, హక్కులపై శిక్షణ ఇవ్వడం ఏమిటో వారికే అంతుబట్టడం లేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగం చేయడానికే తప్ప మరొకటి కాదని వార్డు మెంబరు చెంచురెడ్డి ప్రభుత్వ పనితీరును విమర్శించారు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఆయా గ్రామాల టీడీపీ నాయకులు చెప్పిందే చేస్తున్నారని, వార్డు మెంబర్ల మాటలు ఏ అధికారి వినటం లేదని, అటువంటప్పుడు ఈ శిక్షణ తరగతులు వృథా తప్ప వేరే ప్రయోజనం లేదని ఇది ముమ్మాటికీ నిధుల దుర్వినియోగం అని వార్డు మెంబరు చెంచురెడ్డి, చొప్పర శివ విమర్శించారు.

హాజరు అంతంత మాత్రమే..

శిక్షణకు కొన్ని మండలాల్లో ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్ల కంటే అధికారులే ఎక్కువ మంది హాజరు కావడం గమనార్హం. ఈ నెల 8, 9వ తేదీల్లో ఇచ్చిన శిక్షణకు కొమరోలు, సింగరాయకొండ, గిద్దలూరు, తర్లుపాడు, దర్శి, కనిగిరి నియోజకవర్గాల్లోని మండలాల్లో మొదటి రోజు నలుగురైదుగురు వచ్చినప్పటికీ బుధవారం మాత్రం మొహం చాటేశారు. కొమరోలు మండలంలో బుధవారం శిక్షణకు ఒకే ఒక వార్డు సభ్యుడు రాగా, అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా మధ్యాహ్నం 2 గంటలకే మమ అనిపించారు. తొలిరోజు మంగళవారం శిక్షణకు సింగరాయకొండ మండలం నుంచి 30 మంది, జరుగుమల్లి మండలం నుంచి 60 మంది హాజరు కావాల్సి ఉంది. కానీ సింగరాయకొండలో 9 మంది, జరుగుమల్లి మండలంలో 20 మందే హాజరయ్యారు.

బిల్లులివ్వకుండా నీతులా?

పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులు సక్రమంగా ఖర్చు చేయాలని శిక్షణలో పేర్కొన్న అధికారులు.. గత మూడు నెలలుగా సర్పంచ్‌లకు బిల్లులు చేయకుండా ఎమ్మెల్యేలను కలవాలని సూచించడం ఎంత వరకు సమంజసమన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గ్రామ పంచాయతీ సమావేశాలు, సభల్లో పాల్గొని తీర్మానాలు రూపొందించాలని అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పలువురు ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు పేర్కొన్నారు. ఏ తీర్మానాలు లేకుండా గ్రామాల్లో టీడీపీ నేతలు చేపడుతున్న పనుల సంగతేమిటని ప్రశ్నిస్తున్నారు. పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 83 నుంచి 100, జీవో ఎంఎస్ నం.138 గురించి, ఆర్థిక వ్యవహారాలు, పంచాయతీ పరిధిలోని లేఔట్లు, నియమ నిబంధనలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం. అయితే ఆర్థిక వ్యవహారాల్లో వార్డు సభ్యుల మాట ఎంత వరకు చెల్లుబాటవుతుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా ఒక్క పింఛన్ల పెంపు తప్ప మరే ఇతర హామీని అమలు చేయకపోగా.. ఎప్పుడిస్తారో స్పష్టత లేని పథకాల గురించి శిక్షణలో ప్రస్తావించడాన్ని ప్రజాప్రతినిధులు తప్పుబట్టారు.

ఫ్లెక్సీలకు పసుపు రంగు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రంగుల పేరుతో రాజకీయ రచ్చ చేసిన టీడీపీ నేతలు కోర్టులనూ ఆశ్రయించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రభుత్వ భవనాలకు, చివరికి శిలాఫలకాలకు కూడా పసుపు రంగు వేయడం ప్రారంభించారు. వార్డు మెంబర్ల శిక్షణ తరగతుల సందర్భంగా మండల పరిషత్ కార్యాలయాల్లో పసుపు రంగులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చూసి సర్పంచ్‌లు ముక్కున వేలేసుకున్నారు. ఆ ఫ్లెక్సీలను చూసి కొంతమంది వార్డు సభ్యులు టీడీపీ కూటమి సమావేశంగా భావించి ఇంటికి వెళ్లిపోయారని కె.బిట్రగుంట వార్డు మెంబర్ చెంచురెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయాలు ఏమిటని నిలదీయడంతో జరుగుమల్లి ఈఓఆర్డీ ఏడుకొండలు స్పందించి తమకు ప్రభుత్వం నుంచి ఫ్లెక్సీ డిజైన్ చేసి వచ్చిందని సమాధానమిచ్చారు. అదే నిజమైతే అన్ని మండలాల్లో అదే తరహా ఫ్లెక్సీలు ఉండాలి కానీ ఒక్కో చోట ఒకలా.. అదీ పసుపు రంగుతో దర్శనమిచ్చాయి.



జరుగుమల్లి ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ తరగతుల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పోలీస్ ఇండోర్ హాలును ప్రారంభించిన ఎస్పీ



ఇండోర్ హాలును ప్రారంభిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పోలీసు డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండోర్ హాలును ఎస్పీ ఏఆర్ దామోదర్ బుధవారం ప్రారంభించారు. ఇక్కడ పోలీసు జూడో క్లస్టర్‌లోని తైక్వాండో, కరాటే, పెంచాక్ సిలాట్ గేమ్స్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు ఉన్నాయి. ఈ క్యాంపులో వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసు క్రీడాకారులు శిక్షణ తీసుకుంటారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఇటీవల అస్సాంలో జరిగిన 9వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ -2024 జాతీయస్థాయి పోటీలలో ఏపీ పోలీసు శాఖ నుంచి ప్రాతినిధ్యం వహించి రికార్డు స్థాయిలో 9 పతకాలు సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు జిల్లాలోని డీటీసీలో శిక్షణ పొందుతున్న తైక్వాండో, కరాటే, పెంచాక్ సిలాత్ క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనతో పతకాలు సాధించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన డీటీసీ వసతుల గురించి వాకబు చేశారు. చుట్టూ ఉన్న పరిసరాలను, అక్కడి మౌలిక వసతులు, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. శిక్షణ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అదనపు సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌కుమార్, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, స్టేట్ స్పోర్ట్స్ ఆఫీసర్ రేణుకా అభిరాంరెడ్డి, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, తాలుకా సీఐ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత అందుబాటులో తపాలా సేవలు

- తపాలావారోత్సవాలను పురస్కరించుకొని నేటి నుంచి ఆధార్ కేంద్రాల ఏర్పాటు
- తపాలా శాఖ సీనియర్ సూపరింటెండెంట్ ఎండీ జాఫర్ సాదిక్



మాట్లాడుతున్న పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ ఎండీ జాఫర్ సాదిక్

ఒంగోలు టౌన్: తపాలా సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి నాణ్యమైన సేవలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలను చేపట్టిందని తపాలా శాఖ సీనియర్ సూపరింటెండెంట్ ఎండీ జాఫర్ సాదిక్ తెలిపారు. తపాలా వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం డివిజన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు తపాలా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 5 పోస్టాఫీస్‌లను స్టార్ విలేజీలుగా ప్రకటించినట్లు తెలిపారు. టంగుటూరు మండలంలోని వెలగపూడి, లింగసముద్రం మండలంలోని మెగిలిచెర్ల, మద్దిపాడు మండలంలోని గుల్లాపల్లి, జె.పంగులూరు మండలంలోని చందలూరు, పరుచూరి మండలంలోని జాగర్లమూడి పోస్టు ఆఫీసులను 5 స్టార్ విలేజీలుగా గుర్తించి ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటా తపాలా శాఖ అందిస్తున్న పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. తపాల శాఖ సుకన్య సంవృద్ధి ద్వారా 10 ఏళ్ల లోపు కలిగిన ఆడపిల్లలకు అధిక మొత్తంలో వడ్డీ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా మహిళల కోసం మహిళా సమ్మాన్ సేవింగ్స్, ప్రతి నెల వడ్డీ తీసుకునే వెసులుబాటు కలిగిస్తూ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ (మిస్)లతో పాటుగా అత్యధిక వడ్డీ లభించేలా నేషనల్ సేవింగ్ స్కీమ్, టర్మ్ డిపాజిట్లను గ్రామస్థాయిలో సైతం అందుబాటులో వచ్చేలా అనేక పథకాలకు రూపకల్పన చేసినట్లు వివరించారు. బ్యాంకింగ్ రంగంతో పోటీ పడుతూ మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా ఇంటివద్దనే ఐపీపీబీ ద్వారా సేవలు అందిస్తామని తెలిపారు. పోస్టల్ బ్యాంకులో ఖాతా కలిగిన వారికి ఏటీఎం కార్డు సౌకర్యం కలిగించడమే కాకుండా ఏ బ్యాంకు నుంచైనా నగదును డ్రా చేసుకునే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం నుంచి ఒంగోలు, వలపర్ల, మద్దిపాడు, పేరాల పోస్టాఫీసులలో ఆధార్ నమోదు, సవరణలు చేసుకునేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆధార్ నమోదు కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

రూ.3 లక్షల నగదు చోరీ

- కుమార్తె వివాహం కోసం దాచుకున్న నగదు

కొమరోలు: కుటుంబసభ్యులు గాఢ నిద్రలో ఉన్న సమయంలో అర్ధరాత్రి భారీ దొంగతనం జరిగింది. కుటుంబసభ్యుల కథనం మేరకు..మండలంలోని గోపాలునిపల్లె గ్రామానికి చెందిన వీరంరెడ్డి వాసుదేవరెడ్డి రోజులాగే కుటుంబసభ్యులతో కలిసి ఇంట్లోని ముందు గదిలో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో వాసుదేవరెడ్డి భార్య రాధ బాత్‌రూమ్‌కు వెళ్లి వచ్చి వెనుకవైపు ఉన్న వాకిలి వేయకుండా వచ్చి నిద్రపోయింది. దొంగలు దీనినే అదునుగా తీసుకుని ఇంట్లోకి ప్రవేశించి ఇనుప బీరువాలో ఉంచిన రూ.3లక్షల నగదుతో చోరీ చేశారు. బుధవారం ఉదయం చోరీ జరిగిన విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించి కేసు నమోదు చేశారు. మార్కాపురం నుంచి వచ్చిన క్లూస్‌టీం సంఘటన స్థలంలో ఆధారాలు సేకరించారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

కుమార్తె వివాహానికి దాచుకున్న నగదు..

వాసుదేవరెడ్డి కుమార్తె మౌనికకు వివాహం చేసేందుకు నిశ్చయించారు. వివాహం కోసం నగలు కొనాలనే ఉద్దేశంతో బ్యాంక్‌లో దాచుకున్న రూ.3 లక్షలు తీసుకువచ్చి ఇంట్లోని బీరువాలో పెట్టినట్లుగా తెలిపారు. ఇంతలోనే నగదు చోరీకి గురైందని వాపోయారు.

పెరిగిన ధరలకనుగుణంగా పింఛన్ ఇవ్వాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు టౌన్: ఈపీఎస్ 95 పింఛన్‌దారులకు పెరిగిన ధరలకనుగుణంగా పింఛన్ ఇవ్వాలని, నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో కనీస పింఛన్ రూ.9 వేలకు పెంచాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఏవీ పుల్లారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద ఈపీఎస్ 95 పెన్షనర్ల ఆల్ ఇండియా కమిటీ, ఏపీ ఆర్పీ రాష్ట్ర కమిటీల సంయుక్త పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు రైలు ప్రయాణాల్లో 50 శాతం రాయితీని పునరుద్ధరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెన్షనర్లకు ఇవ్వాల్సిన పీఆర్సీ, డీఆర్ బకాయిలను వెంటనే మంజూరు చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు జి.శేషయ్య కోరారు. 8వ పీఆర్సీ కమిషన్ వేసి తక్షణమే ఐఆర్ 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. చివరి 60 నెలల ప్రకారం హయ్యర్ పెన్షన్ ఆప్షన్‌ను అమలు చేయాలని అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ రాంబాబు కోరారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలని గౌరవాధ్యక్షుడు వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఆర్ సుబ్బారావు, పి. పేరయ్య, ఎస్ రాబిన్ రవికుమార్, జి. నర్సయ్య, ఎస్వీ శ్రీనివాసరావు, సంపత్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు నివేదిక సమగ్రంగా రూపొందించండి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బుగ్గ-కైప-గిద్దలూరు సెక్షన్ 544డీ రోడ్డు విస్తరణ పనులకు సంబంధించిన ప్రాజెక్టు నివేదికను సమగ్రంగా రూపొందించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఎన్‌హెచ్‌ఏఐ, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో సమావేశమై రోడ్డు పనులకు సంబంధించి సమీక్షించారు. అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టు గురించి వివరిస్తూ ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రకాశం జిల్లా పరిధిలో 24.028 కి.మీ.ఉందని వివరించారు. సంబంధిత అధికారులు జాయింట్ పరిశీలన చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పీడీ పద్మ, ఆర్అండ్‌బీ ఎస్ఈ దేవానందం, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులపై కళాశాల ఫీజుల ఒత్తిడి

సాక్షి, అమరావతి: పేద విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజులు చెల్లించేలా ఒత్తిడి తీసుకొస్తూ లేఖలపై బలవంతంగా సంతకాలు చేయిస్తున్న ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ బుధవారం ప్రభుత్వాన్ని బహిరంగ లేఖలో కోరింది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుంటే తల్లిదండ్రులే కట్టాలనడం ఎందరో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. చట్ట విరుద్ధంగా యాజమాన్యాలు విద్యార్థులపై తీసుకొస్తున్న ఒత్తిడిని అడ్డుకోవడంతో పాటు ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని విన్నవించింది.

అమ్మవారికి ముత్యాల చీర



బేస్తవారిపేట: దసరా నవరాత్రుల్లో భాగంగా స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి మూల విరాట్‌కు ముత్యాల చీరతో బుధవారం అలంకరించారు. తమిళనాడులోని సేలం నుంచి ప్రత్యేకంగా అమ్మవారికి రూ.2.20 లక్షలతో ముత్యాల చీర తయారు చేయించినట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు జక్కా కుమార్, శాశ్వత ధర్మకర్త బొంతల లక్ష్మణస్వామి గుప్తా తెలిపారు.

కాళరాత్రి అలంకారంలో బాలా త్రిపురసుందరి



త్రిపురాంతకం: దసరా నవరాత్రుల సందర్భంగా బాలాత్రిపురసుందరీదేవి బుధవారం కాళరాత్రి అలంకారంలో గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం సందర్భంగా ఉత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం దుర్గాష్టమి సందర్భంగా మహాదుర్గ అలంకారంలో నందివాహనంపై ఉత్సవం నిర్వహిస్తారు.

కొండపేటలో చోరీ

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలోని కొండపేటలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పాముల చిన్ననరసింహులు అనే వ్యక్తి ఇంట్లో ఎవరు లేని సమయంలో దుండగులు ఇంట్లోకి ప్రవేశించి రూ.50 వేల నగదు, రెండు జతల బంగారు కమ్మలు, రెండు బంగారు ఉంగరాలు అపహరించారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.